కండక్టర్ కుమారుడికి
ఇంటర్‌లో స్టేట్ ర్యాంక్

సన్మానించి అభినందనలు తెలిపిన కూకట్‌పల్లి డిపో మేనేజర్ ఇసాక్



ఫస్టియర్‌లో స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ సాధించిన భవ్యానందన్‌ను సన్మానిస్తున్న డీఎం ఇసాక్, సిబ్బంది

మూసాపేట: కూకట్‌పల్లి డిపోకు చెందిన కండక్టర్ సోమేశ్వర్ కుమారుడు భవ్యానందన్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించారు. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి డీఎం మహమ్మద్ ఇసాక్ గురువారం కండక్టర్ కుమారుడు భవ్యానందన్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 468 మార్కులు సాధించటం అభినందనీయమని పేర్కొన్నారు. తమ డిపోకు చెందిన కండక్టర్ కుమారుడు రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్, ఎంఎఫ్, ఓఎస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో
గెలిపించుకుందాం



హెచ్‌ఎంటీ హిల్స్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీహిల్స్‌లో చేవెళ్ల లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ కాసాని శ్వేత సుధాకర్, నిజాంపేట్ 19వ వార్డు కార్పొరేటర్ కాసాని సుధాకర్, మాజీ ఎంపీపీ వెంకటేష్ ముదిరాజ్‌తో కలిసి హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు గురువారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్నే శ్రీనివాసరావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇంటింటికి ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో పేదల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామనన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 150 రోజులు దాటినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయటం లేదని ఆరోపించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తి స్థాయి మద్దతు కాసాని జ్ఞానేశ్వర్‌కు ఇవ్వాలన్నారు. ఆయనకు అఖండ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం

కార్పొరేటర్ సబిహా బేగం



పర్వత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం, తదితరులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్ నగర్లో గురువారం మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కార్పొరేటర్ సబిహా బేగం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాదయాత్రలో ప్రజల ఆదరాభిమానం చూస్తేంటే లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమైనట్లు కనిపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాబా, లింగాల ఐలయ్య, రాజు, బ్రహ్మం, వీరారెడ్డి, పల్లి తిరుపతి, రాముయాదవ్, సంజీవ్‌రెడ్డి, విష్ణు, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, పార్వతమ్మ, లక్ష్మీ, రేవతి, సైదమ్మ, చిట్టెమ్మ, సత్యమ్మ, పర్వీన్, షమ్మా, ధన తదితరులు పాల్గొన్నారు.

మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడులపై అవగాహన



అవినాష్ కళాశాలలో మ్యూచ్‌వల్ ఫండ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రొ. శ్వేతాసుందర్

కూకట్‌పల్లి: అవినాష్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో మేనేజ్‌మెంట్ విభాగం సిప్ ద్వారా మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడి ప్రాముఖ్యతపై గురువారం సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయోలా అకాడమీ, అసిస్టెంట్ ప్రొ. శ్వేతా సుందర్ హాజరై ప్రసంగించారు. మ్యూచువల్ ఫండ్స్, ఆచరణాత్మక జీవితంలో దానిలోని చిక్కుల గురించి అవగాహన కల్పించారు. సిస్ పవర్ ఆఫ్ కాంపౌండింగ్ ద్వారా పెట్టుబడి పెట్టడానికి క్రమశిక్షణా విధానాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. అద్భుతమైన ఉపన్యాసాన్ని ఏర్పాటు చేసినందుకు అవినాష్ కళాశాల వ్యవస్థాపకులు బ్రహ్మదేవర, డీన్ డాక్టర్ సుశీల కందూరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎంవీ ఫణిమాల, అధ్యాపక సమన్వయకర్త యు.సురేష్, శ్వేతారెడ్డి, హరిప్రియతో కలిసి ఉపన్యాసానికి హాజరయ్యారు.

టెన్త్‌లో సత్తాచాటిన ఎస్‌పీనగర్ శ్రీచైతన్య విద్యార్థులు



ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ఎస్‌పీ నగర్ రెసిడెన్షియల్ శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం లక్ష్మి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ... 10 జీపీఏ (22) విద్యార్థులు, 9.8 జీపీఏ 48 మంది విద్యార్థులు, 9.7 జీపీఏ విద్యార్థులు 61, 9.5 జీపీఏ ఆ పైన 70 మంది విద్యార్థులు, 9 పైన జీపీఏ 91 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. సకాలంలో పాఠాలను పూర్తి చేయటం, రివిజన్ చేయించటం, విద్యార్థుల స్థాయికి తగిన విధంగా బోధించడం, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవటం వల్ల ఈ అద్భుతమైన ఫలితాలను సాధించామని తెలిపారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ విద్యార్థులను మెడల్స్, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, చైతన్య కళాశాల ఏజీఎం రవికుమార్, శివరామకృష్ణ, ప్రాంతీయ ఇన్‌చార్జి పద్మజ, కోఆర్డినేటర్ మురళీ కృష్ణ, వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

పేరుకే 'మినరల్'

చెరువుల వద్ద వాటర్ ప్లాంట్‌లు

- కనీస ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- ఐఎస్ఐ మార్క్, లైసెన్స్ లేకుండా నిర్వహణ
- అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



మియాపూర్ మినరల్ వాటర్‌ను డబ్బాలలో నింపుతున్న దృశ్యం

మియాపూర్ : ఎండలు మండిపోతుండడంతో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదునుగా ప్యూరిఫై వాటర్ పేరిట కొందరు అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్నారు. పలు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఫిల్టర్ వాటర్ పేరుతో ప్రజలను నిలువుగా దోచేస్తున్నారు. కనీసం నీటిని శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలు కాలనీల్లో మినరల్ వాటర్ పేరుతో కొందరు కనీస ప్రమాణాలు పాటించకుండా బాటిళ్లలో సాధారణ నీటిని నింపుతున్నారు. మియాపూర్ పరిధిలో సుమారు 12 ప్లాంట్లు ఉన్నాయి. ఈ ప్లాంట్లకు ఐసీఎంఆర్ మార్క్ లేకుండానే నీటి వ్యాపారం చేస్తున్నా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. కొన్ని కాలనీలలో ఇళ్లలోనే వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నీటి వ్యాపారం చేస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యాపారాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

- మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఐఎస్ఐ ధ్రువీకరణ పొందాలి. ఇవేమీ లేకుండా కనీస ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లపై అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.
- ఈ నీటి కేంద్రాలను ఎక్కువగా చెరువు చుట్టుపక్కల ప్రాంతాల్లో బోర్లు వేసి అక్కడే మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు.
- ఒక్కొక్క బాటిల్‌కు రూ.25 నుండి రూ.35 వరకు సొమ్ము చేసుకుంటున్నారు.
- కాగా మియాపూర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లకు ఎలాంటి అనుమతులు లేవని పలువురు అంటున్నారు
- నీటిలో మినరల్స్ కలపకుండా, నీటి స్వచ్ఛతను లెక్కించే పరికరాలు లేకుండా బోర్లు వేసి మామూలుగా ఫిల్టర్ చేసి డబ్బాలలో నింపి, అలాగే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.
- వాటర్ ప్లాంట్‌లలో వాడే పరికరాలు నాణ్యత లేకపోవడంతో బాటు సరఫరా చేసే వాటర్ బాటిళ్లను సరిగా శుభ్రపరచకపోవడంతో బాటిళ్లలో పాచి కనపడుతోందని ప్రజలు వాపోతున్నారు.
- ఈ వాటర్ ప్లాంట్లను అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఇవి...

- నీటి కేంద్రం ఏర్పాటుకు అధికారుల అనుమతి ఉండాలి. ప్రతి సంవత్సరం తప్పని సరిగా రెన్యూవల్ చేసుకోవాలి. ప్లాంట్‌లో విశాలమైన హాల్, వెలుతురు, గాలి ఉండాలి.సీల్స్, హెచ్‌డీపీ పైపులైన్‌లు ఉండాలి. ఐఎస్ఐ మార్క్ కలిగిన ఫిల్టర్ యంత్రాలు వాడాలి. నీటి ట్యాంకులు ఇతర సామాగ్రి నాణ్యమైనవి వాడాలి. ఎప్పటికప్పుడు నీటి నిల్వ ట్యాంకర్లు ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. జీహెచ్‌ఎంసీ నుండి ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.
- తాగునీటి ప్లాంట్లను పరిశీలించి నిబంధనలు పాటించని, లైసెన్స్ లేని ప్లాంట్లపై చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు.



మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తాం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు



యూజీడీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని అల్లాపూర్ సొసైటీ విజేత గ్రీస్ హోమ్స్‌లో చేపడుతున్న యూజీడీ పైపులైన్ నిర్మాణ పనులను కాలనీవాసులతో కలిసి హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైదర్‌నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. యూజీడీ వంటి అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని... నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని... పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అదే విధంగా డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అన్ని వేళల ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సంగమేశ్వరరావు, లోకేష్, అప్పిరెడ్డి, రావూరి శ్రీనివాస్, ఆనంద్, రమణ, అప్పారావు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్ షోకు తరలిన గులాబీ దళం



కేటీఆర్ రోడ్ షోకు తరలి వెళ్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మల్కాజ్‌గిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మద్దతుగా నిర్వహించిన కేటీఆర్ రోడ్ షోకు బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. గురువారం సాయంత్రం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో మూసాపేట్ సీతారామ దేవాలయం నుంచి 12 బస్సుల్లో కార్యకర్తలు తరలి వెళ్లారు. ముందుగా ఓల్డ్‌బోయిన్‌పల్లి చౌరస్తా నుంచి ప్రియదర్శిని హోటల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడి నుంచి రోడ్‌షోకు బస్సుల్లో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ముద్దం మాట్లాడుతూ... బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ వస్తోందన్నారు. ఈసారి మాల్కాజ్‌గిరిలో రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, మక్కాల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, వాసుయాదవ్, పిట్ల రాజు, మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, బుర్రి యాదగిరి, కృష్ణారెడ్డి, ఖాదీర్, రాజుగౌడ్, మట్టి శ్రీను, పోచయ్య, లలితా, సరోజినిదేవి, ఉదయరాణి తదితరులు పాల్గొన్నారు.

అకాడెమియా-పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడమే లక్ష్యం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: అకాడెమియా- పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఎస్కీ- జి నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(జీఎన్ఐటీఎస్)మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పరిశోధనలు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, పరిశ్రమ ఆధారిత నైపుణ్యం పెంపుదల కోర్సులకు ఇది వేదికగా నిలుస్తుందన్నారు. ఇంజనీరింగ్ విద్యలో విప్లవాత్మక మార్పులపై విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో జీఎన్ఐటీఎస్ వైస్ చైర్ పర్సన్ శ్రీవిద్యారెడ్డి, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సీతా, ఇంప్రూవ్ 10 ఎక్స్‌సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు రేణుకా చల్లా, విశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా

మల్కాజిగిరి లోక్‌సభ స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీప్రసాద్



నాగోలులో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

నాగోలు: ప్రజలకు సేవకుడిగా పని చేస్తానని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. గురువారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోలు, బండ్లగూడ, ఉప్పల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవీప్రసాద్ మాట్లాడుతూ... మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలోని యువత, మహిళలకు స్థానిక పరిశ్రమల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించడం తన లక్ష్యమన్నారు. మహిళా సాధికారత కోసం, వారికి ఆదాయ వనరులు సమకూర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రచిస్తానని తెలిపారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తనను ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీవాసులు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారు. నాయకులు దుద్దు సుబ్రహ్మణ్యం, రాజేశ్వరరావు, ప్రబల విశ్వనాథం, కైలాశ్, రజని, సువర్ణ పాల్గొన్నారు.

ఘనంగా పెగా యూనివర్సిటీ ప్రోగ్రామ్ కాంక్లేవ్-2024

రాయదుర్గం: రాబోయే తరాలకు సాధికారత కల్పించడమే లక్ష్యమని పెగా సిస్టమ్స్ ఇండియా ప్లాట్‌ఫారమ్ ఇంజనీరింగ్ వైస్ ప్రెసిడెంట్, సైట్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ విశ్వేశ్వరయ్య పేర్కొన్నారు. పెగా యూనివర్శిటీ ప్రోగ్రామ్ కాంక్లేవ్-2024 కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని టాలెంట్ స్ప్రింట్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు.పెగా సిస్టమ్స్, టాలెంట్ స్ప్రింట్‌తో కలిసి ఆధునిక బూట్ క్యాంప్‌లు, అత్యాధునిక అభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పెగా యూనివర్శిటీ ప్రోగ్రామ్ 2023-24 కోహోర్ట్ నుంచి 20 మంది అత్యుత్తమ విద్యార్థులు, జెన్ఏఐ బ్లూప్రింట్ పోటీ విజేతలను సత్కరించారు. అనంతరం టాలెంట్‌స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూ పాల్ మాట్లాడుతూ భవిష్యత్తులో వచ్చే సాంకేతిక సవాళ్లను ఎదుర్కోగలిగే నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని పెంపొందించడంపై దృష్టి పెట్టామన్నారు. కార్యక్రమంలో రెండు సంస్థలకు చెందిన 250 మంది పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మద్దతు తెలిపిన పీజేఆర్ మహిళా నాయకులు



మహిళలతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్‌నగర్ కాలనీకి చెందిన మహిళా నాయకురాళ్లు గురువారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, పుట్టం దేవి, వల్ల రమణ, పర్వీన్, సరిత, యోగేశ్వరి, సరస్వతి, సునీత, లావణ్య, అనూష, పద్మ, విజయ, లలిత, అభిత తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ ఇండియా కళాసిల్క్స్ అండ్ కాటన్ వస్త్ర మేళా



వస్త్ర మేళాలో కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆల్విన్‌కాలనీ: హెచ్‌ఎంటీహిల్స్‌లోని హెచ్‌ఎంటీ కమ్యూనిటీహాల్‌లో హ్యాండ్లూమ్ ఇండియా కళాసిల్క్స్ అండ్ కాటన్ వస్త్రమేళాను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశంలోని అన్ని రకాల చేనేత కళాకారులతో నేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచారు. చేనేత వస్త్రాలు తయారు చేసే వారికి అండగా నిలవడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు ఉపయోగపడతాయని నిర్వాహకులు వికాస్ తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి వస్త్రమేళాలలో చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు ఎంతగానో పెరుగుతాయని అన్నారు.

ఏళ్లుగా భారీ పైపులైన్లు ఇక్కడే.!

మోతీనగర్: మోతీనగర్ చౌరస్తాతో పాటు ప్రధాన రోడ్డులో గత కొన్ని సంవత్సరాల కిందట భారీ సైజు వాటర్ పైపులను రోడ్డుకు అడ్డంగా వేశారు. అసలే రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు ఎప్పుడు వాహనాల రద్దీతో సందడిగా ఉంటుంది. అదే విధంగా అక్రమ పార్కింగ్‌తో పాటు రోడ్డపక్కనే పైపులు వేయటంతో వాహనదారులు, పాదచారులు సమీప దుకాణదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జలమండలి మోతీనగర్ మేనేజర్ విలియం ప్రకాశంను వివరణ కోరగా ఎర్రగడ్డ జలమండలి పరిధిలో తరచూ లీకేజీల కారణంగా ఈ పైపులను ఏర్పాటు చేయటానికి అక్కడ ఉంచామని తెలిపారు. మరి అధికారులు ఈ పైపులను తొలగించి ఇబ్బందులను తొలగిస్తారో లేదో వేచి చూడాలి.



మోతీనగర్ చౌరస్తా, ప్రధాన రోడ్డులో భారీ వాటర్ పైపులు

